Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి (Vol) : 11 సంచిక (Issue) : 65 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు



rajadhanivartalu@gmail.com
94406 62699

గురువారం, 30 - 7 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

## వైభవంగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం

**- ప్రధాని మోదీకి థింసా, కూచిపూడి నృత్యాలతో ఘన స్వాగతం - ఉత్తరాంధ్రకు గర్వకారణంగా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం - ఏఎస్ఆర్ ఎయిర్ పోర్టుపై ప్రతీ ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం - ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**


**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్ట్ 1న ప్రారంభం అవుతున్న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్ర ప్రగతిలో కీలక మైలురాయి అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో నూతన శకం ప్రారంభం అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ప్రయాణ సౌకర్యాలతో పాటు ఉపాధి, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం ఇస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతో పాటు తెలుగు జాతికి గర్వకారణంగా మారనున్న విమానాశ్రయం ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసా, కూచిపూడి నృత్యంతో స్వాగతం పలకాలని అధికారులకు సీఎం సూచించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా ఎక్కువ మందితో థింసా నృత్య ప్రదర్శన ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అరకు కాఫీ సహా స్థానిక పర్యాటకానికి బ్రాండింగ్ జరుగుతుందన్నారు.

**ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు విస్తృత ప్రచారం**

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో విమానాశ్రయం గురించి ప్రతీ ఇంటా చర్చ జరిగేలా విస్తృత ప్రచారం జరగాలని.. మహిళలు, యువత, పాఠశాల విద్యార్థులు ఇలా వివిధ వర్గాలకు చేరువయ్యేలా వేర్వేరు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అవుట్ రీజ్ కార్యక్రమాలు, క్విజ్, ఉపన్యాస పోటీలు, ఫ్లాష్ మాబ్ లు, డ్రోన్ షోలను నిర్వహించాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలతోనూ రౌండ్ టేబుల్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో 3-5కే రన్ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని కూడా విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చూడాలని సూచించారు. మరోవైపు విమానాశ్రయం టెర్మినల్ భవనం ప్రారంభించిన అనంతరం ఇంధన, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖలకు చెందిన రూ.18 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికారులు వివరించారు.

**2.30 గంటల పాటు భోగాపురంలో ప్రధాని పర్యటన**

ఆగస్టు 1వ తేదీ ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రధాని మోదీ చేరుకుంటారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబులు స్వాగతం పలకనున్నారు. 10.58 గంటలకు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం సీఎం, గవర్నర్ తదితరులతో కలిసి ప్రధాని మోదీ టెర్మినల్ భవనాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదికకు ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించనున్న ప్రధాని మోదీకి 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు. 11.30 నుంచి 12.55 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొని, అనంతరం ప్రధాని 1.10 గంటలకు ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.

## ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి

**- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు**





**అమరావతి, (రాజధాని వార్తలు):** ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు... రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

అలాగే ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనే దానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు.మానసిన పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డీఎస్సీ ఆరోపణలపై జగన్‌తో బహిరంగ చర్చకు నేను సిద్ధం

**- వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాలపైనా చర్చిద్దామని లోకేశ్ సవాల్ - జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా - స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యమన్న లోకేశ్ - కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** డీఎస్సీ నియామకాలపై వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

## గాజువాకలో రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

**- ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణంరాజు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి మరియు అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘు రామకృష్ణం రాజు వెల్లడించారు. మంగళ వారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యా దుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు మరియు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్-కార్డులు (రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు. దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజుతో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి-16 కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు.అదే విధంగా స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్-కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఇంకా ఈసమావేశంలో కమిటీ సభ్యులు మరియు శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజు పాల్గొన్నారు.

## పెనుకొండలో మంత్రి సవిత ప్రజా దర్బార్ - ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ

**పెనుకొండ, (రాజధాని వార్తలు):** పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్న పలువురు కుటుంబాలు తమకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్లు, ఇతర పరిపాలనా సమస్యలపై కూడా పలువురు అర్జీలు సమర్పించారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని మంత్రి సవిత స్వయంగా స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల



సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

## - ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి





**కమలాపురం, (రాజధాని వార్తలు):** కమలాపురం నగర పంచాయతీలోని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రిని శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు మరియు సిబ్బంది హాజరు, మందుల లభ్యత, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకొని, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి సూచించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 84వ డివిజన్‌లో జూలై 27 నుండి ఇంటింటి ప్రచారం : మాదంశెట్టి నీలబాబు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** స్థానిక జీవీఎంసీ 84వార్డు పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ సూచనలతో కూటమి ప్రభుత్వము ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృధి కార్యక్రమంలు వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రజలకి వివరించటానికై ఈనెల 27వ తేదీ నుండి డోర్ టు డోర్ ప్రోగ్రాం ఏ విధంగా చేయాలనే దానిపై 84వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు అధ్యక్షతన అనకాపల్లి పార్లమెంట్ ఆఫీసులో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని వార్డ్ అధ్యక్షులు తలారి ప్రసాదు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో 84వ వార్డ్ కోశాధికారి సాలపు మోహన్ వైస్ ప్రెసిడెంట్ పిల్లా తారకేసి రాజు బోడి వెంకట్రావు కోటి రామకృష్ణ రేభక ఈశ్వర అప్పారావు కసిరెడ్డి సత్యనారాయణ శ్రీకాకుళం గణపతి షణ్ముఖ రాజు బత్తుల శ్రీనివాసరావు కాండ్రేగుల జగదీశ్వరరావు ఎండపల్లి మోహన్ బ్రహ్మాజీ ఆడారి రవి నమ్మి రామారావు డొంకాదురు గునాయుడు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ ఎన్ అర్ టీఎస్ గల్ఫ్ రీజినల్ కోఆర్డినేటర్ గా ముస్తాఖ్ ఖాన్



**కడప, (రాజధాని వార్తలు):** ఏపీఎన్ ఆర్‌టిఎస్ గల్ఫ్ రీజినల్ కోఆర్డినేటర్‌గా ముస్తాక్ ఖాన్‌ను అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ముస్తాక్ ఖాన్ మాట్లాడుతు ప్రవాసాంధ్రులకు సేవ చేసే అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎన్‌ఆర్ఐ సాధికారత, సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎం ఆర్ టి ఎస్ చైర్మన్ డాక్టర్ వేమూరి రవి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మధ్యప్రాచ్య, దూరప్రాచ్య దేశాల ప్రత్యేక ప్రతినిధి రాధాకృష్ణ, అలాగే ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ డైరెక్టర్ (ఆపరేషన్స్, సర్వీసెస్) అక్కిలి నాగేంద్రబాబులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. నాపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తున్నానని గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రతి ప్రవాసాంధ్రుడికి ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ ద్వారా మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు, వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్. మాధవి రెడ్డి, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ ఆర్. శ్రీనివాస రెడ్డి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రసాద్, సీనియర్ నాయకులు అమీర్ బాబు, గోవర్ధన్ రెడ్డిలు ముస్తాక్ ఖాన్‌కు అభినందనలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ముస్తాక్ ఖాన్ ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా కార్గిల్ విజయ దినోత్సవం వేడుకలు

**గాలివీడు, (రాజధాని వార్తలు):** మండలంలోని గౌతమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం కార్గిల్ విజయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోల్జర్ రాజశేఖర్ హాజరై కార్గిల్ యుద్ధం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. 1999 మే 3న ప్రారంభమైన కార్గిల్ యుద్ధం లడఖ్‌లోని కార్గిల్ జిల్లాలో భారతదేశం-పాకిస్థాన్ మధ్య 85 రోజుల పాటు కొనసాగిందని తెలిపారు. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘర్షణలో భారత సైన్యం అపూర్వమైన ధైర్యసాహసాలతో శత్రువుల చెరలోకి వెళ్లిన కీలక శిఖరాలను తిరిగి స్వాధీనం చేసుకుని చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని చెప్పారు. 1999 జూలై 26న సాధించిన ఆ విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది కార్గిల్ విజయ దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్ల సేవలను ప్రతి భారతీయుడు చిరకాలం గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు సైజు థామస్, షింటో ఇమాన్యుల్ మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం




వంటి విలువలను విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. కార్గిల్ వీరుల త్యాగాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం అమర జవాన్లకు నివాళులర్పించి, దేశభక్తి గీతాలు, ప్రసంగాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రజక కార్పొరేషన్ ద్వారా ధోబీఘాట్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

## - వడ్డీలేని రుణాలు, పెన్షన్లు మంజూరుచేసి రజకుల అభివృద్ధికి చేయూత అందించాలి - కడప జిల్లా బి సి కార్పొరేషన్ ఇడికి రజక సంఘం వినతి



**కడప, (రాజధాని వార్తలు):** కడప జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న ధోబీఘాట్ల మరమ్మతులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని, రజక వృత్తిదారుల సంక్షేమంకోసం సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరుతూ 26 తేదీ శనివారం ఉదయం 11 గంటలకు కడప నగరములోని కలెక్టర్ ఆఫీస్ నందు గల బిసి కార్పొరేషన్ కార్యాలయములో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు కడపజిల్లా రజక సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని అనేక ధోబీ ఘాట్లు మరమ్మతులకు గురవడంతో కోసం రజకులకు అవి పూర్తిస్థాయిలో ఉపయోగపడడం లేదని పేర్కొంది. కడప నగరంలో రజకుల జనాభా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం రిపేరులోవున్న నకాష్, చిన్నచౌక్, బాలాజీనగర్ ధోబీఘాట్లకు నిధులు మంజూరు చేయాలని, అలాగే యర్రముక్కపల్లి, పాతకడప, మోచంపేట, నబీకోట, రవీంద్రనగర్ ప్రాంతాల్లో కొత్త ధోబీఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రజక కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ రజక యువతకు రూ.3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన రజక వృత్తిదారులకు పెన్షన్లు అందించాలని, ధోబీఘాట్ల స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా ప్రత్యేక జీవో జారీ చేయాలని, నిరుపయోగంగా ఉన్న ధోబీఘాట్ల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని రజక సంఘ నేతలు వినతి పత్రంలో కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాండ్రీ వృత్తిదారులకు నెలకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలులో అద్దె భవనాల్లో పనిచేస్తున్న లాండ్రీ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు లీజ్ అగ్రిమెంట్ కోరుతుండగా, భవన యజమానులు ఆ పత్రాలు ఇవ్వకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని పొందలేకపోతున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపాలని వారు బి సి కార్పొరేషన్ అధికారులను కోరారు.

ఈ వినతిపత్రంపై కడప జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చేలో రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.కృష్ణమూర్తి, సి. చెన్నప్ప, జి.పిచ్చయ్య, జి. కృష్ణయ్య, బి.ఎరికలయ్య, జిల్లా ఉపా ధ్యక్షుడు జి.ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్న గంగన్న, చేలో చంద్ర తదితరులు సంతకాలు చేశారు.

# రైతన్నలకు అండగా. వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వ కట్టుబాటు : ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి





**కమలాపురం, (రాజధాని వార్తలు):** కమలాపురం నగర పంచాయతీలోని నల్లింగాయపల్లె ప్రాథమిక సహకార సంఘం నందు శనివారం నిర్వహించిన యూరియా పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే వ్యవసాయానికి అవసరమైన ఎరువులు రైతులకు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఎరువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ, వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని, రైతుల ఆదాయాన్ని పెంచే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అన్నదాత సంతోషమే రాష్ట్ర అభివృద్ధికి పునాది. రైతు బాగుంటే. రాష్ట్రం బాగుంటుంది ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

## - నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి - విద్యార్థి సంఘాల డిమాండ్

**కడప, (రాజధాని వార్తలు):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కడప జిల్లాలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, విద్యార్థి సంఘాల నాయకులు రవి, రాజేంద్ర, అరుణ్, జగన్ నాయక్, సి.పి. నాగేంద్ర, అశోక్‌లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన తీవ్రమైన వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై న్యాయం కోరుతూ విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనలు, దీక్షలను భగ్నంచేసి వారిపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత పూర్తిగా దెబ్బతిన్నాయని, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన ఈ ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనల నేపథ్యంలో



ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గోపి, హరి, నరసింహ, అఖిలేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పిట్లవానిపాలెం మండలంలో నూతనంగా ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ కార్యాలయం







**పిట్లవానిపాలెం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్.మాధవ్ సోమవారం ఉదయం పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో పిట్టల వానిపాలెం మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు అక్కల రామిరెడ్డి, మండల యువమోర్చా అధ్యక్షుడు మన్నెం భాను శివప్రసాద్, సీనియర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు వందలాదిగా ప్రజలు ఉత్సా హంగా పాల్గొన్నారు.

# మంత్రి "కొండపల్లి" ఆట విడుపు

**- అమరావతి ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ - ఆటలలో పాల్గొనడం ముఖ్యం, గెలుపు ఓటములు సహజం - క్రీడలలో పాల్గొంటే శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మరుపల్లి మోడల్ హైస్కూల్ నందు నియోజకవర్గ స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను సోమవారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ ఉంటే బాల్య జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులలో ప్రతిభను వెనుక తీయడం కోసం నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు ఏర్పాటు చేయడంతో పాటు నగదు బహుమతులు ప్రకటించడం జరిగిందన్నారు. అలాగే స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచిన ఘనత నారా లోకేష్‌కి దక్కుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యం కూడా రక్షించుకోవచ్చన్నారు. విద్యార్థి దశలో క్రీడల్లో ప్రతిభ చాటి సర్టిఫికెట్లు పొందినట్లయితే ఉద్యోగ సమయాల్లో ఉపయోగపడతాయని తెలిపారు. ఆటలలో, చదువులో గెలుపు, ఓటములు, ప్రథమ తృతీయ స్థానాలు సాధారణమని, ఓటమితో కృంగిపోకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వికాసానికి సరికొత్త బాటలు

**- ఐఐఎంఆర్‌తో సీటీయూఏపీ చారిత్రాత్మక అవగాహన ఒప్పందం**




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** హైదరాబాద్ గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఊతమిచ్చేలా హైదరాబాద్ వేదికగా ఒక సువర్ణాధ్యాయం ఆరంభమైంది. విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ, ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనల్లో పరస్పర సహకారం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ-విజయనగరం), ప్రతిష్టాత్మక ఐసీఏఆర్-భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్-హైదరాబాద్) చేతులు కలిపాయి. సీటీయూఏపీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య టి.శ్రీనివాసన్, ఐఐఎంఆర్ సంచాలకులు డాక్టర్ తారా సత్యవతి ఈ ప్రతిష్టాత్మక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఈ నూతన మైత్రీ బంధాన్ని అక్షరబద్ధం చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో సీటీయూఏపీ వృక్షశాస్త్ర విభాగాధిపతి, నోడల్ అధికారి డాక్టర్ అనిరుధ్ కుమార్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు, సీనియర్ అధ్యాపకులు పాల్గొని ఈ బృహత్తర కార్యక్రమానికి సాక్షీభూతులయ్యారు. ఈ చారిత్రాత్మక భాగస్వామ్యం ద్వారా పలు కీలక అంశాలపై దృష్టి సారించనున్నారు:పర్యావరణహితమైన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, గిరిజన రైతాంగం స్వావలంబన దిశగా అడుగులు వేసేలా వారిలో అపారమైన సామర్థ్య పెంపు, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ మెళకువలు,విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై శిక్షణ, వినూత్న అంశాలపై సంయుక్త పరిశోధనలు తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీటీయూఏపీ ఉన్నత స్థాయి బృందం ఐసీఏఆర్-భారత వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) సంచాలకులు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ బృందంతో ప్రత్యేకంగా సమావేశమైంది. గత ఏడాది చేపట్టిన ప్రగతిశీల కార్యక్రమాలను సింహావలోకనం చేసుకుంటూ, ఈ ఏటి భవిష్యత్ కార్యచరణకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గిరిజన రైతులకు వ్యవసాయంలో మెరుగైన శిక్షణ అందించడం, అంతరించిపోతున్న దేశీయ వరి వంగడాల పరిరక్షణ, మరియు పరిశోధన-విస్తరణ కార్యక్రమాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని తీర్మానించారు. ఆచార్య టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ ఈ విద్యా, పరిశోధనాత్మక కలయిక గిరిజన ప్రాంతాల్లో సుస్థిర వ్యవసాయానికి వెన్నెముకగా నిలుస్తుంది. అనాదిగా వస్తున్న వారి అపారమైన సంప్రదాయ విజ్ఞానాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికతను జోడించి వారి జీవనోపాధి ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ వినూత్న ఒప్పందాలు ఎంతగానో దోహదపడతాయి" అని హర్షం వ్యక్తం చేశారు.

# చందోలు ఆలయాలను సందర్శించిన ఏపీ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్

**- బగళాముఖి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు**

**- స్వాగతం పలికిన ధర్మకర్తల మండలి చైర్మన్,ఈఓ**





**బాపట్ల, (రాజధాని వార్తలు):** ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చుకుని అమ్మవారి సన్నిధిలో ప్రశాంతంగా ధ్యానం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయానికి విచ్చేయగానే ధర్మకర్తల మండలి చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి స్వాగతం పలుకగా వేద పండితులు పూర్ణకుంభముతో వేదమంత్రముల పూర్వకంగా ఆలయం ప్రదక్షిణం గావించి తొలుతగా క్షేత్ర పరిపాలకునికి అర్చనలు జరిపారు.

వారికి దేవస్థానం తరపున వేద ఆశీర్వచనం జరిపించి పట్టు శాలువా అమ్మవారి చిత్రపటంతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలోనే ఈ ఆలయ ప్రఖ్యాతి చేకూరుతుందని అమ్మవారి వైభవం ఎంతోమంది తనకి తెలియ చెప్పిన మీదట వెంటనే ఆలయానికి విచ్చేశానని ఆలయానికి కావలసిన సౌకర్యాల విషయంలో సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియ పరిచారు. తదుపరి శ్రీ లింగోద్భవ స్వామివారి దేవస్థానానికి విచ్చేయగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పరిమి రామకృష్ణ సాయి బాబు స్వాగతం పలికి ఆలయ అర్చకులు దండిభట్ల శ్రీనివాస శాస్త్రి వెంకటసుబ్బయ్యలు అర్చన కార్యక్రమాలు నిర్వహించి వేద ఆశీర్వచనం జరిపించి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగిందని దేవస్థానముల ఈవో జి.నరసింహమూర్తి తెలియజేశారు.

# కలెక్టర్ రాం సుందర్‌రెడ్డిని అభినందించిన మంత్రులు అచ్చెంన్నాయుడు, కొండపల్లి

**- మన్ కీ బాత్‌లో జిల్లాపై మోదీ ప్రశంసలు గర్వకారణం**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జలధార జలహారతి పథకం అమలు తీరుతో విజయనగరం జిల్లాను దేశంలోనే ముందంజలో ఉండేలా చేసిన జిల్లా కలెక్టర్ రాం సుందర్‌రెడ్డిని మంత్రులు కె. అచ్చెంన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో విజయనగరం జిల్లాను ప్రత్యేకంగా ప్రస్తావించడం జిల్లా వాసులు గర్వించదగ్గ విషయం అని మంత్రులు కొనియాడారు. సోమవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ హరిత విమానాశ్రయం సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జలధార జలహారతి కార్యక్రమంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లి దేశ ప్రధాని మోదీచే కితాబు అందుకోవడం సంతోషకరమన్నారు. విజయనగరం జిల్లాను అన్ని విభాగాల్లో కూడా ప్రథమ స్థానంలో ఉండేలా అధికారులు కృషి చేసేందుకు ఇది ఒక ఆదర్శనీయమైన గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పి. ఏ ఆర్.దామోదర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, విశాఖ మెట్రో పాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ - 2026-27కు యువత భారీ సంఖ్యలో నమోదు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువతలో నైపుణ్యాలను పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే అవకాశాలను కల్పించేందుకు నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ - 2026-27లో అర్హత కలిగిన యువత అధిక సంఖ్యలో పాల్గొని నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐ.ఎ.ఎస్. పిలుపునిచ్చారు. సోమవారం తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఇండియా స్కిల్స్ కాంపిటీషన్-2026-27 పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు దేశ, విదేశీ స్థాయిలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని తెలిపారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ ఇండియా, వరల్డ్ స్కిల్స్ ఇండియా భాగస్వామ్యంతో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ పోటీలు యువతలో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, నవీన ఆలోచనలు, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ పోటీల్లో మొత్తం 63 నైపుణ్య విభాగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ 4.0, మెకాట్రానిక్స్, రోబోట్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమొబైల్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్, వెల్డింగ్, వెబ్ టెక్నాలజీస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీ థెరపీ, హెవీ వెహికల్ టెక్నాలజీ, ప్లంబింగ్, రిన్యూవబుల్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని వివరించారు.

వయోపరిమితి: 01 జనవరి 2003 లేదా ఆ తరువాత జన్మించిన వారు కొన్ని ఎంపిక చేసిన టీమ్ మరియు వ్యక్తిగత నైపుణ్య విభాగాలకు అర్హులు. 01 జనవరి 2006 లేదా ఆ తరువాత జన్మించిన వారు మిగతా వ్యక్తిగత నైపుణ్య విభాగాలకు అర్హులు.

పోటీల నిర్వహణ దశలు:

జిల్లా ? రాష్ట్ర ? ప్రాంతీయ ? జాతీయ ? అంతర్జాతీయ (వరల్డ్ స్కిల్స్) స్థాయిలలో పోటీలు నిర్వహించబడతాయి. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన అభ్యర్థులు భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ అంతర్జాతీయ వరల్డ్ స్కిల్స్ పోటీలలో పాల్గొనే అవకాశం పొందుతారు. అర్హత కలిగిన యువత SIDH పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి యువకుడు, యువతి సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి వినయ్ కుమార్, సెట్నెల్ సిఈవో నాగేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖయ్యూం, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## దూసుకొస్తున్న టిప్పర్ లారీలు... భయంలో రాజధాని ప్రజలు!

రాజధాని అమరావతి నిర్మాణ పనుల పేరుతో రోడ్లపై గంటకు 90 / 100 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్న కన్‌స్ట్రక్షన్ టిప్పర్ లారీలు సామాన్య వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఈ "టిప్పర్ రేసింగ్" వల్ల రాజధాని పరిధిలోని ప్రధాన రహదారులు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. నిబంధనలను తృణీకరిస్తూ, అతివేగంతో వెళ్తున్న ఈ వాహనాల కారణంగా తరచూ రహదారి ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది.

**నిబంధనలు కాగితాలకే పరిమితం!**

రాజధాని ప్రాంతంలో సీఆర్డీఏ నిర్మించిన విశాలమైన సీడ్ యాక్సెస్ రోడ్లు, తుళ్లూరు, రాయపూడి, మందడం, వెలగపూడి ప్రధాన రహదారులపై ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. నిబంధనల ప్రకారం జనవాసాలు, సచివాలయ సమీప ప్రాంతాల్లో భారాస వాహనాలు నిర్ణీత వేగ పరిమితిని దాటకూడదు. అంతేకాకుండా మట్టి, ఇసుక, గ్రావెల్ లోడుతో వెళ్లే లారీలపై ఖచ్చితంగా తార్పాలిన్ కవర్లు కప్పాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది:

అతివేగం – నిర్లక్ష్యం:

ఓవర్‌లోడ్‌తో వచ్చే టిప్పర్లు ద్విచక్ర వాహనాలను కూడా గమనించకుండా ఓవర్‌టేక్ చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి.

డస్ట్ పొల్యూషన్: ఎలాంటి కవర్లు కప్పకుండా గ్రావెల్ లోడుతో వెళ్లడం వల్ల గాలులకు దుమ్ము, చిన్న చిన్న రాళ్లు వెనుక వస్తున్న వాహనదారుల కళ్లల్లో పడి నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

డ్రైవర్ల నిర్లక్ష్యం: ఎక్కువ ట్రిప్పులు వేస్తే ఎక్కువ కమీషన్ వస్తుందనే ఆశతో కొందరు డ్రైవర్లు పోటీపడి వాహనాలను నడుపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

'జెన్ జీ' యువత & ఉద్యోగుల తీవ్ర అవస్థలు

సచివాలయానికి, అసెంబ్లీకి వెళ్లే ఉద్యోగులతో పాటు, రాజధాని పరిధిలోని విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, యువత ఈ వేగవంతమైన లారీల వల్ల తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. "అమరావతిలో రోడ్లు బాగున్నాయని సంతోషపడాలో... వెనుక నుంచి ఏ టిప్పర్ లారీ వచ్చి గుద్దుతుందో అని భయపడాలో అర్థం కావడం లేదు" అని ఓ ఐటీ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణ చర్యలు అవసరం: స్థానికుల డిమాండ్

వరుస ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని అమరావతి రైతులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు:

స్పీడ్ గన్ల ఏర్పాటు:

ప్రధాన రహదారుల్లో స్పీడ్ గన్లు ఏర్పాటు చేసి, పరిమితి దాటిన టిప్పర్లపై భారీ జరిమానాలు విధిస్తుండాలి.

టైమ్ నిబంధనలు: ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో భారాస వాహనాల రాకపోకలపై పాక్షిక ఆంక్షలు విధించాలి.

డ్రైవర్లకు కౌన్సెలింగ్: కాంట్రాక్ట్ ఏజెన్సీలు తమ డ్రైవర్లకు వేగ నియంత్రణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి.

పత్రాల తనిఖీ: ఫిట్‌నెస్ లేని పాత లారీలను రాజధాని రోడ్లపైకి అనుమతించకూడదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి అమరావతి రహదారులపై ప్రయాణాన్ని సురక్షితంగా మార్చాలని రాజధాని వాసులు కోరుతున్నారు.

## ఎఐఎస్‌బి ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం

### - కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి - ఎఐఎస్బి రాష్ట్ర అధ్యక్షుడు సగిలి రాజేంద్రప్రసాద్

**కడప, (రాజధాని వార్తలు):** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే నీట్ (ఎన్ ఇ ఇ టి) పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఎఐఎస్‌బి) ఆంధ్రప్రదేశ్ కమిటి ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా కడప జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్‌కు మద్దతుగా స్వచ్ఛందంగా మూతపడ్డాయి. పెద్ద సంఖ్యలో విద్యార్థులు బంద్‌లో పాల్గొని సంఘీభావం తెలిపారు. విద్యా వ్యవస్థను పరిరక్షించడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడడమే ఈ బంద్ లక్ష్యమని ఎఐఎస్‌బి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌బి రాష్ట్ర అధ్యక్షుడు సగిలి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీలు మాట్లాడుతూ, దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సమగ్ర విచారణ జరిపి, ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా విద్యార్థి, యువజన సంఘాలు శాంతియుతంగా ఆందోళనలు కొనసాగిస్తున్నప్పటికి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. విద్యార్థుల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని, వారి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# మదనపల్లె ఆర్టీఓ కార్యాలయం తరలింపు నిర్ణయం విరమించాలి

### - లారీలు ఎక్కువ వున్న మదనపల్లెలో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు చేయాలి
### - మదనపల్లె వైసిపి సమన్వయ కర్త నిస్సార్ అహమ్మద్



**మదనపల్లె, (రాజధాని వార్తలు):** మదనపల్లెలో ఉన్న ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీవో) కార్యాలయాన్ని రాయచోటికి తర లించే ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని, రాయచోటి లోని ఏటీఎస్ కేంద్రం మదనపల్లెలో ఏర్పాటు చేయాలని మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లె వైయస్సార్ సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జింక వెంకట చలపతి, రఫీతో కలిసి నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా జిల్లా కేంద్రంగా మదనపల్లెను ఏర్పాటు చేసినా ఎప్పుడు సిఎం మనసు మార్చుకుని మళ్ళీ జిల్లా కేంద్రం రాయచోటికి తరలిస్తాడో చెప్పలేమని ఎద్దేవా చేశారు. మదనపల్లె పేరుమీద జిల్లా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరితే అన్నమయ్య జిల్లా ఇక్కడి ఏర్పాటు చేశారని, ఇది సిఎం చంద్రబాబునాయుడు మనస్తత్వానికి నిదర్శనమన్నారు. మదనపల్లెలో వేలాది మంది లారీ యజమానులు వున్నారని, వారి ఇబ్బందులు గుర్తెరిగి జిల్లా రవాణా శాఖ కార్యాలయం మదనపల్లెలో ఏర్పాటు చేయాలని కోరారు. అన్నమయ్య జిల్లాలో సుమారు 25 వేల భారీ వాణిజ్య వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో రవాణా అవసరాలు ఉన్న నేపథ్యంలో ఆర్టీవో కార్యాలయాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, తరలించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. ఆర్టీవో కార్యాలయం తరలిస్తే వాహన యజమానులు, డ్రైవర్లు, వ్యాపారులు, విద్యా సంస్థలు, పరిశ్రమ వర్గాలు రిజిస్ట్రేషన్, పర్మిట్లు, పన్నులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులు, యాజమాన్య బదిలీలు వంటి సేవల కోసం 80 కిలోమీటర్లు దూరంలోని రాయచోటికి వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీని వల్ల అదనపు ఖర్చులు, సమయ నష్టం, ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా మదనపల్లెకు 80 కిలోమీటర్ల పరిధిలో ఆటో మేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్ లేక పోవడంతో వాణిజ్య వాహనాల యజమానులు ఫిట్‌నెస్ పరీక్షల కోసం రాయచోటికి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ఇంధన వ్యయం, డ్రైవర్ వేతన భారం, వాహనాల నిలిపివేత కారణంగా ఆర్థిక నష్టం కలుగుతోందని తెలిపారు. మదనపల్లె ఆర్టీవో కార్యాలయం తరలింపు ప్రతి పాదనను విరమించుకోవడంతో పాటు మదనపల్లె కార్యాలయాన్ని జిల్లా రవాణా కార్యాలయంగా అప్‌గ్రేడ్ చేసి, ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్‌ను మదనపల్లెలో ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 62 వసంతాలు పూర్తి చేసుకున్న ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి

### - అత్యంత వైభవంగా ఎస్వీఎంసీ 62వ 'ఫౌండేషన్ డే' వేడుకలు
### - పరిశోధనలు జరిగితేనే పేద రోగులకు మెరుగైన వైద్యం
### - మొదటి బ్యాచ్ (1964) ప్రతినిధి డాక్టర్ ప్రేమానంద రాయ్
### - పూర్వ సూపరింటెండెంట్ల చిత్రపటాలతో గౌరవిస్తాం
### - రుయా సూపరింటెండెంట్ డాక్టర్ బి.మనోహర్





**తిరుపతి, (రాజధాని వార్తలు):** రాయలసీమలోనే ప్రముఖ వైద్య విద్యా కేంద్రంగా, పేద ప్రజల పాలిట సంజీవనిగా సేవలందిస్తున్న తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల, అనుబంధ రుయా ఆసుపత్రి నేటితో విజయవంతంగా 62 వసంతాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు ఆధ్వర్యంలో కాలేజీ అనాటమీ లెక్చర్ గ్యాలరీలో 'ఫౌండేషన్ డే' (కళాశాల అవతరణ దినోత్సవం) వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పరిశోధనలే వైద్య రంగానికి మూలస్తంభాలు డాక్టర్ ప్రేమానంద రాయ్ ఈ కార్యక్రమానికి 1964లో ఎస్వీ వైద్య కళాశాల ప్రారంభమైన నాటి మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రేమానంద రాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తిరుపతి పరిసర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నాటి మొదటి బ్యాచ్ వైద్యులు కొందరు ఈ వేడుకలో పాల్గొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పీజీ వైద్య విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి డాక్టర్ ప్రేమానంద రాయ్ ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దిశానిర్దేశం చేశారు. పరిశోధనల ప్రాధాన్యత వైద్య రంగంలో నిరంతరం వస్తున్న మార్పులను గమనిస్తూ, ఎప్పటికప్పుడు నూతన పరిశోధనలు చేసినప్పుడే పేద రోగులకు సులువుగా, మెరుగైన వైద్య సేవలు అందించగలమని స్పష్టం చేశారు. కమ్యూనిటీ మెడిసిన్ సేవలు తాము చదువుకునే రోజుల్లో 'ప్రివెంటివ్ సోషల్ మెడిసిన్' (సామాజిక వైద్య విభాగం) ఎంతగానో తోడ్పడిందని, సమాజంలోని కట్టకడపటి నిరుపేదలకు వైద్య సేవలు అందించడానికి ఈ విభాగం ద్వారానే ఎన్నో మెలకువలు నేర్చుకున్నామని గుర్తు చేశారు. అనంతరం, సమాజానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తుగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్‌లు ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. పూర్వ దిగ్గజాల సేవలకు సముచిత గౌరవం రుయా ఆసుపత్రి ఈ స్థాయికి చేరడానికి నాటి నుండి నేటి వరకు పనిచేసిన సూపరింటెండెంట్లు, వైద్యుల కృషి ఎంతో ఉంది. ఆనాటి మాజీ సూపరింటెండెంట్ల సేవలను నిరంతరం గుర్తుంచుకునేలా వారి చిత్రపటాలను సేకరించి రుయా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నాం. అప్పుడే వారికి మనం నిజమైన గౌరవాన్ని అందించిన వారమవుతాం. డాక్టర్ బి.మనోహర్, అదనపు వైద్య విద్య సంచాలకులు & రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉత్సాహంగా పాల్గొన్న వైద్య బృందం ఈ వేడుకల్లో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఏ.ఎస్. కిరీటి, పల్మనాలోజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, కళాశాల వైద్య అధ్యాపకులు, సీనియర్ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు మరియు పి.ఆర్.ఓ. వీర కిరణ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# ఘనంగా తోట శివ సాయి పుట్టినరోజు వేడుకలు

### - ధ్వజారెడ్డి, ముద్దా బాబుల్ రెడ్డి

**రైల్వే కోడూరు, (రాజధాని వార్తలు):** రైల్వే కోడూరు మాజీ ఉప సర్పంచ్ వైసిపి సీనియర్ నాయకులు తోట శివ సాయి ప్రజా సేవలో ప్రత్యేక శైలిని కనబరిచారని రైల్వేకోడూరు ఉప మండలాధ్యక్షులు పుల్లంపేట మాజీ మండల అధ్యక్షులు ముద్దా బాబుల్ రెడ్డిలు అన్నారు శనివారం రైల్వేకోడూరు మాజీ ఉపసర్పంచ్ తోట శివసాయి 57వ జన్మదిన పురస్కరించుకొని వైసిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఉపసర్పంచ్ తోట శివ సాయి గ్రామ పట్టణ పురవీధుల్లో పారిశుద్యానికి పెద్దపీట వేసి పరిశుభ్రతను పాటించి పట్టణ ప్రజల మన్ననలను పొందారు తోట శివ సాయి ఎన్నో సంఘ సేవ కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలను పొందారని వారు కొనియాడారు. వైసిపి కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించి అగ్ర నాయకుల దృష్టిలో తోట శివ సాయికి ఒక ప్రత్యేకతను సంపాదించుకున్న నాయకులని మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని వారు కొనియాడారు. అనంతరం తోట శివ సాయిని పూలమాలతో అభిమానులు ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దార్ల చంద్రశేఖర్, గోపి, నాయిని హరికృష్ణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నూకా మహేశ్వర్ రెడ్డి, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, గని, యాదవ సంఘం నాయకులు కౌరెడ్డి సిద్దయ్య, బత్తిన ఆనంద్, ఆర్ వి రమణ, శెట్టిగుంట మైనార్టీ నాయకులు షఫీ, అన్వర్ భాష ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డి బజార్ శ్రీలక్ష్మి సత్యనారాయణ స్వామి దేవస్థానంలో విశేష పూజలు

### - ఆలయ అర్చకులు కే.విజయ బట్టర్



**కమలాపురం, (రాజధాని వార్తలు):** తొలి ఏకాదశి సందర్భముగ కడప నగరంలోని గడ్డి బజార్ శ్రీలక్ష్మీసత్యనారాయణ స్వామి ఆలయంలో విశేషమైన పూజలు.. ఆలయ అర్చకులు విజయ్ బట్టర్ స్వామి ఆధ్వర్యంలో వారికి తెల్లవారుజామున నుండి స్వామి వారికి నిత్యతంకార్యాలు అభిషేకాలు నిర్వహణ అనంతరం తులసీ సహస్రనామార్చన, విశేషపూజలు నిర్వహించారు, అనంతరము కన్నుల పండగ గా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంపత్ వెంకట్ సాయి రిత్విక్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు



**గాలివీడు, (రాజధాని వార్తలు):** రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన సంపత్ సాయి హరీష్ కుమారుడు సంపత్ వెంకట్ సాయి రిత్విక్ జన్మదిన వేడుక టీడీపీ కార్యాలయంలో అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు కేక్ కట్ చేసి చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ, సంపత్ వెంకట్ సాయి రిత్విక్ మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, ఉన్నత విద్యాభివృద్ధితో జీవితంలో ఎన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. చిన్నారి జీవితమంతా సుఖసంతోషాలు, ఐశ్వర్యం, విజయాలతో నిండిపోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేసి వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు.

# మిట్స్‌కు జాతీయ స్థాయి ర్యాంకింగ్

### - వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి

**మదనపల్లె, (రాజధాని వార్తలు):** మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ప్రతిష్టాత్మక ది వీక్–హంసా రీసెర్చ్ సర్వే 2026 విడుదల చేసిన ఇండియాస్ బెస్ట్ కాలేజెస్ ర్యాంకింగ్స్ లో జాతీయ స్థాయిలో విశిష్ట స్థానాలను దక్కించుకున్నట్లు మిట్స్ వ్యవస్థాప కులు, ఛాన్సలర్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి తెలిపారు. ఈ సర్వేలో మిట్స్‌కు ఆల్ ఇండియా ఇంజినీరింగ్ కళాశాలల విభాగంలో 140వ ర్యాంకు, దేశంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలలో 114వ ర్యాంకు, దక్షిణ భారత ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలలో 74వ ర్యాంకు, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలలో 11వ ర్యాంకు లభించడం విశ్వవిద్యాలయం సాధిస్తున్న విద్యా ప్రగతికి నిదర్శనమన్నారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం, విద్యార్థుల ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నైపుణ్యం, పరిశోధనా వాతావరణం, విద్యార్థి అభివృద్ధి వంటి పలు కీలక ప్రమాణాల ఆధారంగా నిర్వహించిన సమగ్ర మూల్యాంకనంలో మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును పొందిందన్నారు. విద్యా నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతులైన ఇంజినీర్లను తీర్చిదిద్దడంలో మిట్స్ నిరంతరం కృషి చేస్తోందని, ది వీక్–హంసా అందించిన ఈ జాతీయ స్థాయి ర్యాంకింగ్ విశ్వ విద్యాలయం సాధిస్తున్న అకడమిక్ ప్రగతి, పరిశోధనా ప్రతిభ, పరిశ్రమలతో బలమైన అనుసంధానం, అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలకు నిదర్శనమని తెలిపారు.

# చెన్నై లవ్ స్టోరీ 3 రోజుల బాక్సాఫీస్ రిపోర్ట్.. లెక్క ఏ స్థాయిలో ఉందంటే..



కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చెన్నై లవ్ స్టోరీ సినిమా థియేటర్లలో తన ఫస్ట్ వీకెండ్‌ను సక్సెస్ ఫుల్‌గా ముగించుకుంది. మొదటి రోజు నుంచి వస్తున్న టాక్‌తో ఈ మూవీకి వసూళ్లు ఓకే లెవెల్‌లో వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. లేటెస్ట్‌గా ఈ చిత్ర నిర్మాణ సంస్థ అఫీషియల్‌గా ఒక పోస్టర్‌ని రిలీజ్ చేస్తూ సినిమా కలెక్షన్లపై క్లారిటీ ఇచ్చింది. మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ ప్రకారం, ఈ సినిమా మూడు రోజుల్లోనే వరల్డ్ వైడ్‌గా దాదాపు రూ. 40.1 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు తెలుస్తోంది.సినిమా రిలీజైన తొలి వీకెండ్‌లో ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ వల్లే ఈ రేంజ్ నంబర్స్ వచ్చాయని నిర్మాతలు ఆ పోస్టర్‌లో చెప్పారు. ముఖ్యంగా సోషల్ మీడియా డిస్కషన్లు, నెటిజన్లు ఇచ్చిన రివ్యూలు ఈ లవ్ డ్రామాకు కలెక్షన్ల పరంగా కాస్త హెల్ప్ అయినట్లు కనిపిస్తోంది. మొదటి రోజు కంటే తర్వాతి రెండు రోజుల్లో బుకింగ్స్ మెరుగవ్వడం బాక్సాఫీస్ దగ్గర ఈ ప్రాజెక్ట్‌కి బాగా కలసి వచ్చింది. కంటెంట్‌లో ఉన్న ఎమోషన్‌కు యూత్ ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఎమోషనల్ కనెక్ట్ ఉన్న ప్రేమకథ కావడంతో కుర్రకారు థియేటర్ల వైపు ఎక్కువగా వస్తున్నట్లు సమాచారం.

నటీనటులు కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ మధ్య వచ్చే సీన్స్ చాలా న్యాచురల్‌గా ఉండటం, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకు పర్ఫెక్ట్‌గా సెట్ అవ్వడంతో ఫస్ట్ వీకెండ్ మంచి ఆక్యుపెన్సీ నమోదైనట్లు తెలుస్తోంది. దీనికితోడు రేస్‌లో వేరే పెద్ద సినిమాలు ఏవీ పోటీలో లేకపోవడం కూడా ఈ మూవీ వీకెండ్ కలెక్షన్లు పెరగడానికి ఒక ప్లస్ పాయింట్‌గా మారింది.

# చికాగోలో మీనూ అందాలు.. లైట్ వెలుతురులో జిగేల్‌మంటూ!



అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ నటనతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. వరుస సినిమాలతో అవకాశాలు అందుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. తాజాగా వెకేషన్‌లో భాగంగా చికాగో కి వెళ్ళింది. అక్కడి అందాలను ఆస్వాదిస్తూ.. విదేశీ వీధుల్లో చక్కర్లు కొడుతూ.. రాత్రుల్లో లైట్ వెలుతురులో జిగేలుమంటూ నెటిజన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. విదేశీ వీధుల్లో మీనూ గ్లామర్ టచ్.. వెకేషన్‌లో భాగంగా చికాగోకి వెళ్ళిన మీనాక్షి చౌదరి వైట్ టీ షర్టు, బ్లాక్ షార్ట్ ధరించి కళ్లకు గ్లాసెస్, తలపై క్యాప్ పెట్టుకొని తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా అక్కడి అందాలను ఆడియన్స్‌తో పంచుకుంటూ చికాగో పరిసర ప్రాంతాలను పరిచయం చేసింది. మరికొన్ని ఫోటోలలో ఆమె గడిపిన రిసార్ట్ ఫోటోలను షేర్ చేస్తూనే ఇంకొన్ని ఫోటోలలో తన స్నేహితులతో కలిసి ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదుకగా పంచుకుంది. గమ్యంలోనే కాదు జర్నీలో కూడా.. మీనాక్షి చౌదరి ఇన్స్టాగ్రామ్ వేదికగా ఈ ఫోటోలను షేర్ చేస్తూ గమ్యంలోనే కాకుండా ప్రయాణంలో కూడా ఆనందాన్ని వెతుక్కునే ప్రయత్నం చేయాలని గుర్తుంచుకోండి అంటూ తన అభిప్రాయాలను పంచుకుంది. అంతేకాదు ఈ ఫోటోలకు క్యాప్షన్‌గా ఒక్క నిమిషం చికాగో అంటూ తన అభిప్రాయాలను పంచుకుంది. మొత్తానికైతే మీనాక్షి చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అమ్మడి అందానికి చికాగో పరిసర ప్రాంతాలకు ఫిదా అవుతూ తమ అభిప్రాయాలను ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంటున్నారు. మోడల్ నుండి సినీనటిగా ప్రయాణం.. మోడల్గా తన కెరీర్ ను ప్రారంభించిన మీనాక్షి చౌదరి 2018లో ఫెమినా మిస్ ఇండియా, మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ ఫస్ట్ రన్నరప్‌గా నిలిచి.. రెడ్ కార్పెట్‌పై ర్యాంప్ వాక్‌తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక అలా మోడల్‌గా అందరి దృష్టిని ఆకట్టుకున్న మీనాక్షి చౌదరికి ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాలో హీరోయిన్గా అవకాశం లభించింది. అక్కినేని సుశాంత్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో హీరోయిన్గా నటించి తన అందంతో అందరి దృష్టిని ఆకట్టుకుంది మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి సినిమాలు.. ఖిలాడి సినిమాతో రవితేజ సరసన నటించి మంచి పేరు సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి.. హిట్ 2 సినిమాతో మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. గుంటూరు కారం లక్కీ భాస్కర్ , మట్కా, మెకానిక్ రాకీ వంటి చిత్రాలతో వరుసగా విజయాలు అందుకున్న ఈమె..సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ ని తన ఖాతాలో వేసుకుంది. అనగనగా ఒక రాజు సినిమాతో ప్రేక్షకులను అలరించిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం ఒకవైపు తన వరుస ప్రాజెక్టులలో నటి స్తూనే.. మరొకవైపు ఇలా కాస్త విరామం దొరికితే వెకేషన్‌కి వెళ్ళిపోయి ఎంజాయ్ చేస్తోంది.

# ట్రెండీ అవుట్ ఫిట్‌తో పూజా హెగ్డే గ్లామర్ లుక్!



ఒక లైలా కోసం అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన పూజా హెగ్డే గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో, నటనతో ఆకట్టుకుంటున్న ఈ పొడుగు కాళ్ళ సుందరి.. ముఖ్యంగా త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన అల వైకుంఠపురం సినిమాలో హీరోయిన్‌గా నటించి.. బుట్ట బొమ్మగా మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది..ఆ తర్వాత నటించిన దువ్వాడ జగన్నాథంసినిమా కూడాఈమెకు మంచి ఇమేజ్ అందించింది. వరుసగా అవకాశాలు అందుకుంటున్న సమయంలోనే.. కథల ఎంపిక విషయంలో కాస్త తడబడ్డ పూజా హెగ్డే..మళ్లీ ఆ ఫ్లాప్‌ల నుండి తేరుకోవడం లేదు. ఈమె నటించిన ప్రతి సినిమా కూడా డిజాస్టర్‌గా నిలుస్తుండడంతో చాలామంది ఈమెపై ఐరన్ లెగ్ ముద్ర వేశారు. ఇకపోతే సినిమాలలో ఫ్లాప్ అందుకుంటున్నప్పటికీ ఇటు సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ సరికొత్త గ్లామర్ టచ్‌తో ఆడియన్స్‌లో కొత్త జోష్ నింపుతోంది పూజాహెగ్డే. అందులో భాగంగానే తాజాగా మరో ట్రెండీ అవుట్ ఫిట్‌తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. తాజాగా పూజా హెగ్డే తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ విషయానికి వస్తే.. బ్రౌన్ కలర్ టూ పీస్ కో ఆర్డ్ సెట్ ధరించింది. స్ట్రక్చర్ ప్లస్ టాప్‌కి దీనికి సరిగ్గా సరిపోయే వేస్టెడ్ వైడ్ లెగ్ ట్రౌజర్‌తో తన మేకోవర్‌ను ఫుల్ ఫిల్ చేసుకుంది. ముఖ్యంగా ఈమె ధరించిన టాప్ విషయానికి వస్తే.. టాప్ మధ్యలో డివైడ్ చేసినట్టు డిజైన్ చేసిన ఓవర్ ల్యాప్‌పెప్లం గలస్ట్రాప్ లెస్ బ్యాండ్యూ సిల్హౌట్ టాప్‌ను ధరించింది.

బాటమ్ హై రైజ్, రిలాక్స్డ్ వైడ్ లెగ్ ప్యాంటు ఈమె అందాన్ని రెట్టింపు చేసింది. పైగా ఈ ఔట్ఫిట్‌కి కాంబినేషన్‌లో హై హీల్ ధరించింది ఈ ముద్దుగుమ్మ. బరువైన బంగారు గొలుసు, చౌకర్ నెక్లెస్‌తో చాలా అందంగా సింపుల్‌గా కనిపించింది.. ఇక పూజ హెగ్డే ధరించిన ఈ సింపుల్ ట్రెండీ ఔట్ ఫిట్‌అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

# అనిల్ రావిపూడి డేట్స్ దొరకడం కష్టమేనా?



టాలీవుడ్‌లో స్టార్ హీరోల క్యాలెండర్లు ఎంత బిజీగా ఉంటాయో, ఇప్పుడు కొందరు స్టార్ డైరెక్టర్ల షెడ్యూల్స్ కూడా అంతే బిజీగా మారుతున్నాయి. ముఖ్యంగా కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనిల్ రావిపూడి విషయంలో ఇదే డిస్కషన్ ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తోంది. ఒక సినిమా పూర్తవకముందే తదుపరి ప్రాజెక్ట్‌పై హీరోలు, నిర్మాతలు ఆసక్తి చూపుతున్న పరిస్థితి ఏర్పడిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అనిల్ రావిపూడి డేట్స్ కోసం ముందుగానే ప్లాన్స్ రెడీ చేసుకోవాల్సిన అవసరం నిర్మాతలకు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా తెలుగు సినిమా మార్కెట్‌లో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాల హవా కొనసాగుతున్నప్పటికీ, ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్‌గా చేసుకున్న కమర్షియల్ ఎంటర్‌టైనర్లకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఆ కేటగిరీలో తనకంటూ ప్రత్యేక శైలిని నిర్మించుకున్న డైరెక్టర్లలో అనిల్ రావిపూడి ముందువరుసలో నిలిచారు. కామెడీ, ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్‌ను సమతూకంగా మిళితం చేసే ఆయన కథనశైలికి థియేటర్లలో మంచి రెస్పాన్స్ వస్తోంది. మారుతున్న ఆడియన్స్ అభిరుచికి అనుగుణంగా తన ఫార్ములాలో చిన్నచిన్న మార్పులు చేస్తూ, మెయిన్ కమర్షియల్ అంశాలను మాత్రం కొనసాగించడం ఆయన సక్సెస్‌కు మెయిన్ రీజన్ అని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో స్టార్ హీరోల నుంచి కూడా అనిల్ రావిపూడిపై ఆసక్తి పెరుగుతోందనే డిస్కషన్ కొనసాగుతోంది. ఒకవైపు తమ ఇమేజ్‌కు తగ్గ కథలను అందించగల డైరెక్టర్‌గా, మరోవైపు షూటింగ్‌ను అనుకున్న టైమ్‌కు పూర్తి చేసే మేకర్‌గా ఆయనకు ఉన్న పేరు నిర్మాతల్లో విశ్వాసాన్ని పెంచుతోంది. అందుకే సినిమా మొదలుపెట్టడానికి చాలా ముందే అతని డేట్స్‌ను లాక్ చేసే వ్యూహాన్ని నిర్మాణ సంస్థలు అనుసరిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక ప్రాజెక్ట్ లేటైతే దాని ఎఫెక్ట్ తర్వాతి సినిమాలపై కూడా పడే అవకాశం ఉండటంతో, లాంగ్‌టర్మ్ ప్లానింగ్‌కు నిర్మాతలు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోల డేట్స్ మాత్రమే కాదు, స్టార్ డైరెక్టర్ల అందుబాటు కూడా కీలక అంశంగా మారుతోంది.

ఒక సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ తో సినిమా చేయడం ఇప్పుడు కేవలం క్రియేటివ్ డెసిషన్ మాత్రమే కాకుండా, బిజినెస్ స్ట్రాటజీగానూ మారిందనే అభిప్రాయం బలపడు తోంది. ఈ పరిస్థితుల్లో అనిల్ రావిపూడి షెడ్యూల్ చుట్టూనే పలువురు హీరోలు, నిర్మాతలు తమ ఫ్యూచర్ ప్రాజెక్టులను ప్లాన్ చేస్తున్నారనే డిస్కషన్ సినీ వర్గాల్లో కొనసాగుతోంది. అందులో భాగంగానే అనిల్ కోసం టాలీవుడ్ లోని పలు అగ్ర నిర్మాణ సంస్థలు క్యూ కడుతున్నాయని, వారిలో కొంద రికి అనిల్ ఆల్రెడీ సినిమా చేయడానికి కమిట్‌మెంట్ కూడా ఇచ్చారని తెలుస్తోంది.

# లయ కల్పతరువు : మృదంగ మహారాణి డాక్టర్ మండపాక నాగలక్ష్మి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో, ప్రత్యేకించి కర్ణాటక సంగీత రంగంలో వాయిద్య ప్రదర్శనలకు ప్రాణం పోసేది 'లయ'. ఆ లయకు రూపం ఇచ్చి, మృదంగ వాదనలో పురుషాధిక్యత కలిగిన రంగాన్ని సుసంపన్నం చేసి, మహిళా మృదంగ విద్వాంసులలో అగ్రగణ్యురాలిగా విరాజిల్లుతున్న మహోన్నత వ్యక్తిత్వం డాక్టర్ మండపాక నాగలక్ష్మి గారిది. తాజాగా చెన్నైలో సేవా రత్న పురస్కారం స్వీకరించిన నేపథ్యంలో డాక్టర్ మండపాక నాగలక్ష్మి గారిపై ప్రత్యేక కథనం.



విశాఖపట్నంలో జన్మించి, లయ సంగీత సేవను తన జీవిత ధ్యేయంగా మలుచుకున్న ఈ మృదంగ మహారాణి, దేశ విదేశాలలో అశేష సంగీత ప్రియులను తన హస్తలాఘవంతో సమ్మోహన పరిచారు. విశాఖపట్నంలో ఎం.విమల మరియు దివంగత ఎం.వి.జె.కె.మూర్తి దంపతులకు 1966 డిసెంబర్ 25న జన్మించిన నాగలక్ష్మి, బాల్యం నుంచే సంగీతం పట్ల అంతులేని అభిరుచిని కనబరిచారు. సంగీత విద్వాంసుల కుటుంబ వాతావరణం ఆమెకు తొలి మెట్టు కాగా, ఆమె పట్టుదల, గురుభక్తి, నిరంతర సాధన ఆమెను నేడు 'మృదంగ మహారాణి' స్థాయికి చేర్చాయి. సంగీత సాధనలో గురువు పాత్ర అనన్య సామాన్యమైనది. డాక్టర్ మండపాక నాగలక్ష్మి మృదంగ వాదనలో అత్యున్నత మెళకువలను అభ్యసించడానికి ప్రముఖ విద్వాంసుల వద్ద కఠోర దీక్ష వహించారు. తొలుత నేమాని సోమయాజులు గారి వద్ద ప్రాథమిక శిక్షణ పొందిన ఆమె, ఆ తర్వాత మరింత ఉన్నతమైన అభ్యసన కోసం ముళ్ళపూడి శ్రీరామమూర్తి గారి వద్ద మరియు ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు కారైకుడి ఆర్. మణి (చెన్నై) గారి వద్ద అడ్వాన్స్‌డ్ శిక్షణను పొందారు. ఈ దిగ్గజాల మార్గదర్శకత్వంలో ఆమె మృదంగ వాదనలో సరికొత్త మెరుపులను, లయ విన్యాసాలను సంతరించుకున్నారు. కేవలం వాయిద్యానికే పరిమితం కాకుండా, విద్యాపరంగా కూడా ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (తిరుపతి) నుండి సంగీతంలో 'ఎం.ఏ.' (వోకల్) పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖపట్నం) నుండి మృదంగం, గాత్రం మరియు లైట్ మ్యూజిక్‌లో అనేక డిప్లొమాలను సాధించి తన విద్యా తపస్సును చాటుకున్నారు. ఆకాశవాణి మరియు దూరదర్శన్‌లలో 'ఏ' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన డా.మండపాక నాగలక్ష్మి, ఇప్పటివరకు దేశ విదేశాలలో 3000లకు పైగా కచేరీలలో మృదంగ సహకారం అందించి అద్భుత రికార్డు సృష్టించారు. నాగలక్ష్మి గారి మృదంగ నాదం కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆమె నేపాల్, థాయిలాండ్, అమెరికా (వాషింగ్టన్ డి.సి., పిట్స్‌బర్గ్, క్లీవ్‌లాండ్, న్యూయార్క్, న్యూజెర్సీ, బాల్టిమోర్, యంగ్స్‌టౌన్ తదితర నగరాలు) దేశాలలో జరిగిన అనేక ప్రతిష్టాత్మక కచేరీలలో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక సంబంధాల మండలి ద్వారా అధికారికంగా ఎంపిక చేయబడిన కళాకారిణిగా దేశం యొక్క కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వేదికలపై ఇనుమడింపజేశారు. చెన్నైలోని ది మ్యూజిక్ అకాడమీ, శ్రీ కృష్ణ గానసభ, శ్రీ నారద గానసభ, పార్థసారథి సభ వంటి ప్రఖ్యాత సభలలో అగ్రశ్రేణి గాయకులకు మృదంగ సహకారం అందించారు. సంగీత కాలనిధి డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ద్వారం భావనారాయణరావు, బొంబాయి సిస్టర్స్, హైదరాబాద్ సిస్టర్స్, త్రిచూర్ బ్రదర్స్ వంటి ఎందరో మహానుభావుల గాత్ర కచేరీలకు ఆమె మృదంగం మోగించి సభాసదుల నీరాజనాలు అందుకున్నారు. అలాగే ప్రముఖ వయొలిన్, వీణ, ఫ్లూట్ విద్వాంసులతో కలిసి ఆమె చేసిన తాలవాద్య కచేరీలు శ్రోతలను పరవశింపజేశాయి. కళాకారిణిగానే కాకుండా, పరిపాలనా దక్షురాలిగా మరియు అంకితభావం గల ఉపాధ్యాయురాలిగా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. విజయనగరంలోని ప్రతిష్టాత్మకమైన 'ఎం.ఆర్. ప్రభుత్వ సంగీత మరియు నృత్య కళాశాల'లో 31 సంవత్సరాల పాటు మృదంగం లెక్చరర్‌గా సేవలు అందించి, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సంగీత విద్యారంగానికి మహోపకారము చేస్తున్నారు. అంతకుముందు రాజమహేంద్రవరంలోని విజయశంకర ప్రభుత్వ సంగీత మరియు నృత్య కళాశాలలో కూడా ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, మరియు ఛత్తీస్‌గఢ్‌లోని ఇందిరా కళా సంగీత విశ్వవిద్యాలయాలకు పేపర్ సెట్టర్‌గా మరియు ఎగ్జామినర్‌గా వ్యవహరిస్తూ విద్యా ప్రమాదాల పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. యూట్యూబ్ వేదికగా దాదాపు 400లకు పైగా మృదంగ పాఠాలను అప్‌లోడ్ చేసి, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులకు ఉచితంగా విద్యను చేరువ చేసిన ఘనత ఆమెది. "ఉత్తమ ఉపాధ్యాయురాలు"గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి, మాజీ ముఖ్యమంత్రి మరియు గవర్నర్ల చేతుల మీదుగా అనేక పురస్కారాలను అందుకున్న కళా తపస్విని డా.మండపాక నాగలక్ష్మి డా.మండపాక నాగలక్ష్మి గారి కళా తపస్సుకు నిదర్శనంగా దేశ విదేశాల నుండి అనేక బిరుదులు, గౌరవ డాక్టరేట్లు లభించాయి. జెరూసలేమ్ విశ్వవిద్యాలయం మరియు యు.ఎస్.ఏ.కి చెందిన అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ నుండి ఆమె 'గౌరవ డాక్టరేట్లు' అందుకున్నారు. బొంబాయి సుర్ సింగార్ అకాడమీ వారి నుండి "తలమణి", గుంటూరు వారి నుండి "గాయత్రీ సంగీత విద్వన్మణి", విజయవాడ వారి నుండి "మృదంగ మహారాణి" రాజమహేంద్రవరం వారి నుండి "సంగీత సరస్వతి" మరియు "వాద్య కళావసంతిక", వారణాసిలోని హిందూ బనారస్ విశ్వవిద్యాలయంలో పద్మశ్రీ యెల్ల వెంకటేశ్వరరావు గారి చేతుల మీదుగా "లయ గంగా తరంగిణి" వంటి అత్యున్నత బిరుదులతో సత్కరించబడ్డారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మరియు వివిధ అంతర్జాతీయ సంస్థల నుండి 'భారత్ గౌరవ్', 'గ్లోరీ ఆఫ్ ఇండియా', 'ప్రైడ్ ఆఫ్ ఏషియా', 'మహాత్మా గాంధీ ఎక్సలెన్స్ అవార్డు', 'రాష్ట్రీయ పద్మ గౌరవ్ పురస్కార్', 'మహిళా శక్తి శిరోమణి' వంటి ఎన్నో జాతీయ మరియు అంతర్జాతీయ పురస్కారాలు ఆమెను వరించాయి. ఆకాశవాణి ఆడిషన్ బోర్డు సభ్యురాలిగా, కేంద్ర విద్యా సంస్థల మరియు పలు సాంస్కృతిక సంస్థల నిర్వహణలో ఆమె క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సంగీతం అనేది ఒక యజ్ఞం అయితే, అందులో లయ అనేది హృదయ స్పందన లాంటిది. ఆ లయ హృదయానికి స్పష్టమైన రూపమిస్తూ, మృదంగ వాదనలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకుని, మహిళా శక్తికి నిలువునా నిదర్శనంగా నిలిచారు డాక్టర్ మండపాకనాగలక్ష్మి . తన జీవితాన్ని సంగీత అభ్యసనానికి, బోధనకు, సేనకు అంకితం చేసిన ఆమె ప్రస్థానం భావితరాల సంగీత కళాకారులకు ఎప్పటికీ ఒక మహోజ్వల మార్గదర్శకం. ఆమె మృదంగ నాద తరంగాలు తెలుగు నేల కీర్తిని దశదిశలా చాటుతూనే ఉంటాయి.

# ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే : మంత్రి బీసీ జనార్ధన రెడ్డి

## - గజపతినగరం నియోజకవర్గం ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలన : మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బీద రవిచంద్ర, దామచర్ల సత్య

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని రోడ్లు భవనాల శాఖ మాత్యులు బిసి జనార్ధన రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజపతినగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లపై జిల్లా మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్, పరిశీలకులు బీద రవిచంద్ర, దామచర్ల సత్యలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో, అత్యాధునిక సదుపాయాలతో, చూడముచ్చటైన హంగులతో నిర్మించబడిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కోసం దేశమే కాకుండా ప్రపంచమే ఎదురు చూస్తుందన్నారు. వెనకబడిన ప్రాంతంగా పేరు కలిగిన ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని విధాల కృషి చేస్తున్నారటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్‌తో పాటు విశాఖలో గూగుల్ వంటి సంస్థ ఏర్పాటుతో పరిశ్రమలు రావడం, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. మన ప్రాంతానికి వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీని గౌరవించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఒక రోజును





త్యాగం చేయాల్సి ఉందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గానికి తొలిసారిగా వచ్చిన ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్ధన రెడ్డికి స్వాగతం పలుకుతూ మెంటాడ రోడ్డు నిర్మాణం కోసం మూడున్నర కోట్లు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గజపతినగరం నుండి 20 వేల మందితో ప్రధానమంత్రి మోడీ సభకు జన సమీకరణ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్ప బలంతో భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మాణం చేపట్టటం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ విమానాశ్రయం ప్రారంభించడానికి స్వయంగా దేశ ప్రధాని మన ప్రాంతానికి రావటం గర్వకారణమని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. దామచర్ల సత్య మాట్లాడుతూ విజయనగరం ప్రాంతంలో తొలిసారిగా లక్షల మందితో జరిగే అల్లూరి సీతారామరాజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనేక ప్రారంభ కార్యక్రమాలను వర్చువల్‌గా చేస్తున్నారని, కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఉన్న అభిమానంతో విమానాశ్రయం ప్రారంభించడానికి స్వయంగా రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు.

చరిత్రలో ఆగస్టు ఒకటి మన ఉత్తరాంధ్ర ప్రాంత చరిత్రలో లిఖించదగిన రోజు అని అన్నారు. ఈ కార్యక్ర మంలో డీసీఎంఎస్ చైర్మన్ గొంపా కృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బిజెపి నాయకులు రెడ్డి పావని, జనసేన నాయకులు మర్రపు సురేష్, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జెడ్పిటిసి మక్కువ శ్రీధర్, క్లస్టర్ ఇంచార్జ్ వైకుంఠం ప్రదీప్ కుమార్, భాజాపా నాయకుడు భాస్కరరావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ కార్య కర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు సెల్ఫ్ ఫైనాన్స్ బీటెక్ కోర్సులకు ప్రభుత్వ ఆమోదం

## - 2026-27 విద్యా సంవత్సరం నుంచి 240 సీట్లతో ప్రవేశాలు : ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కాకుటూరు గ్రామంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్లో 2026-27 విద్యా సంవత్సరం నుంచి నాలుగు బీటెక్ కోర్సులను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ G.O.Rt.No.153, తేదీ 25-07-2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆమోదం పొందిన కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఉన్నాయి. ప్రతి కోర్సుకు 60 చొప్పున మొత్తం 240 సీట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలకు నాలుగు నూతన బీటెక్ కోర్సులకు అనుమతి ఇవ్వడం ఆనందదాయకమని తెలిపారు. భవిష్యత్ పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ కోర్సులు విద్యార్థులకు అత్యుత్తమ ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలను విశ్వవిద్యాలయం కల్పిస్తోందని ఆయన తెలిపారు. విద్యార్థులు, విద్యార్థినుల కోసం ప్రత్యేక హాస్టల్ వసతి, ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, బస్సు రవాణా సౌకర్యం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక కంప్యూటర్ సెంటర్, అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రయోగశాలలు (ల్యాబ్‌లు), విశాలమైన క్రీడా మైదానాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో కూడిన ఉత్తమ విద్యా వాతావరణం అందుబాటులో ఉంటుందని వివరించారు. అదనంగా, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పనపై విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో తక్కువ వ్యయంతో నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే అరుదైన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఉపకులపతి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రభుత్వ ఇంజినీరింగ్ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులకు ముఖ్య గమనిక:
కాలేజ్ పేరు: విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాకుటూరు, కాలేజ్ కోడ్: VSUESF, మొత్తం సీట్లు : 240, కోర్సులు: CSE, AI & ML, AI & DS, ECE (ప్రతి కోర్సుకు 60 సీట్లు) పూర్తి వివరాల కోసం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: www.vsu.ac.in, Mail :vsuce@vsu.ac.in, Mobile No: +919059676703

# జిల్లాలో విజయవంతంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి

## - 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశాం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - 'సర్' ప్రక్రియ పూర్తి కావడానికి అహర్నిశలు శ్రమించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపిన కలెక్టర్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, ఇది రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు. మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్‌ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 38,645 డూప్లికేట్ ఓట్లు (1.96 శాతం) గుర్తించామని, సంబంధిత ఓటర్ల అంగీకారంతో వాటిని తొలగిస్తామని తెలిపారు. అలాగే 1,13,421 మంది (5.75 శాతం) శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిగా, 80,699 మంది (4.09 శాతం) మరణించిన వారిగా, 57,077 మంది (2.89 శాతం) అందుబాటులో లేని వారిగా గుర్తించినట్లు వివరించారు. ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి అవసరమైన ఆధారాలు సమర్పిస్తే వారి ఓటు హక్కును పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ నెల 31వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, అనంతరం దానిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు గుర్తింపు పొందిన ఎనిమిది రాజకీయ పార్టీలకు ప్రింట్, పెన్‌డ్రైవ్ రూపంలో అందజేస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ప్రచురణ అనంతరం 30 రోజుల పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అర్హులైన ఓటర్లు తమ పేర్లు లేకపోయినా లేదా వివరాల్లో లోపాలు ఉన్నా సంబంధిత ఈఆర్‌ఓ, ఏఈఆర్ఓలను సంప్రదించి సవరించుకోవచ్చన్నారు. "అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడటమే భారత ఎన్నికల సంఘం లక్ష్యం. సీఈఓ వివేక్ యాదవ్ సూచనలు సలహాల మేరకు జిల్లాలో సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయగలిగాం. అలాగే గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, తాసిల్దార్లు, ఆర్‌డీవోలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు," అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌ఓ విజయ్ కుమార్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయం

**- కోవూరులో అవినీతి అనే మాటే లేదు - పాటూరు పంచాయతీలోనే రూ. 3.83 కోట్ల పనులు - అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే లక్ష్యం - ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**కోవూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. సోమవారం కోవూరు మండలం, పాటూరు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ తిరిగి, రెండేళ్ల కాలంలో రాష్ట్రంలోనూ, కోవూరు నియోజకవర్గంలోనూ జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని సరిదిద్దుకుంటూ అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు 99 శాతం వాగ్దానాలను నెరవేర్చామని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాల్లో సరికొత్త రికార్డు**

కూటమి ప్రభుత్వం రాగానే సామాజిక పింఛనును ఒకేసారి రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచడమే కాకుండా, దివ్యాంగులకు రూ. 6 వేలు, మంచానికే పరిమితమైన బాధితులకు రూ. 15 వేలు అందిస్తూ ఆసరాగా నిలుస్తోందని చెప్పారు 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ రూ. 15 వేల చొప్పున జమ చేస్తున్నామన్నారు. రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ' సాయాన్ని రూ. 13500 నుంచి రూ. 20 వేలకు పెంచగా, 'స్త్రీ శక్తి' పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తూనే, త్వరలోనే 'నేతన్న సేవలు' ద్వారా రూ. 25 వేల ఆర్థిక సాయం అందించబోతున్నామని తెలిపారు. అలాగే, ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలు, మత్స్యకారులకు రూ. 20 వేల వేట నిషేధ భృతి అందించడంతో పాటు గీత కార్మికులు, వడ్డెర సామాజిక వర్గాలకు లీజులు, అవకాశాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించామని అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రాష్ట్రంలో రూ. 1345 కోట్లు పేదల వైద్యం కోసం వెచ్చించామని, అలానే రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు అందించామని చెప్పారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇచ్చామని, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రాజముద్రతో పాసు పుస్తకాలు అందించామని స్పష్టం చేశారు.

**పాటూరు పంచాయతీలోనే రూ. 3.83 కోట్ల అభివృద్ధి**

గడిచిన రెండేళ్లలో ఒక్క పాటూరు పంచాయతీలోనే రూ. 3 కోట్ల 83 లక్షల 54 వేల అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే అన్నారు. ఇరిగేషన్ శాఖ: రూ. 97.70 లక్షలతో పంట కాలువల పూడికతీత, గ్రావెల్ రోడ్లు, ప్రొటెక్షన్ వాల్స్, శ్లాబ్ కల్వర్టులు, కాలువల మరమ్మతులు పూర్తి చేశాం. పాటూరు వంతెన నిర్మాణానికి రూ. 90 లక్షలు మంజూరయ్యాయని అన్నారు.
విద్యుత్తు శాఖ: రూ. 1.05 కోట్లతో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, 12 కొత్త స్తంభాలు, ఎస్సీ/ఎస్టీ సబ్ ప్లాన్ కింద 60 ఇళ్లకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఇచ్చాం. =ఋూ ద్వారా రూ. 80 లక్షలతో చెంచమ్మ కాలనీ, చెక్కిరాల దిబ్బ ప్రాంతాల్లో 24 గంటల ఉచిత విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశాం.
ఆర్‌డబ్ల్యూఎస్ & తాగునీరు: రూ. 52 లక్షలతో జల్ జీవన్ మిషన్ కుళాయిలు, పైప్‌లైన్ ఎక్స్‌టెన్షన్లు, పంప్ సెట్లు అందుబాటులోకి తెచ్చాం.
చేనేత రంగం: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వం తరఫున రూ. 76 లక్షలతో పాటూరు, గుమ్మలదిబ్బ క్లస్టర్లను ఏర్పాటు చేశాం.
ఆరోగ్య సహాయం: పాటూరులోని 20 పేద కుటుంబాలకు రూ. 17.34 లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశాం.

**ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం**

కామాక్షమ్మ కాలనీలో మహిళలు కోరిన కాలువల నిర్మాణం, పొలాలకు గ్రావెల్ రోడ్డు, కాలువ రివెట్‌మెంట్ పనులను త్వరలోనే పూర్తి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 'కోవూరు నియోజకవర్గంలో గత రెండేళ్లగా 'అవినీతి' అనే మాటే వినపడటం లేదు. కూటమి నాయకులు ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి మన అభివృద్ధిని వివరించాలి. ప్రజలకు ఏ చిన్న సమస్య ఉన్నా, అర్హత ఉండి పని జరగకపోయినా నేరుగా నా వద్దకే రావచ్చు. మీ ఓటుతో గెలిచాం, మీ సేవలోనే నిరంతరం ఉంటాం.'అని చెప్పారు. అనంతరం అంగన్వాడీ సిబ్బందికి ఇండక్షన్ స్టవ్, కుక్కర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కోవూరు మండలం అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, అంగన్ వాడీ అధికారులు, టీడీపీ నేతలు. కూటమి నేతలు వివిధ శాఖ అధికారులు, మహిళ నాయకులు ఉన్నారు.

# గురు పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించాలి

**- గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడే**



**విడవలూరు, (రాజధాని వార్తలు):** శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో జూలై 29వ తేదీన బుధవారం రానున్న గురు పౌర్ణమి పండుగ నుఅత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అని ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షులు డి.సురమౌళి అన్నారు. ఈ సందర్భంగా విడవలూరులోని మన్మధ రావు పేట, జాన్ పేటలోఅనుబంధంగ్రంధాలప్రచారం చెయ్యడం జరిగింది. "త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక" నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం గురు పౌర్ణమి రోజు ప్రతి ఒక్కరు భగవద్గీత సత్సంగం నిర్వహించుకుని ఘనంగా పూజా కార్యక్రమాలు చేసుకోవాలి అని కోరారు. గురు పౌర్ణమి యొక్క-గురువు గొప్పతనం గురువు అంటే "గు"ణాతీతుడు అలాగే "రూ"పవర్జితుడు అని అర్థం. గురువుకు గుణముల మలినం లేదు అలాగే రూపంలేదు.. కాబట్టి ఆయనను "గురు" అని అన్నారు. ఇంకా చెప్పాలంటే "గుంద్రము అను పదము నుండి పుట్టిన పదమే గురువు" అని చెప్పవచ్చు. ఆది మద్యాంత రహితుడైన పరమాత్మ భూమి పై భగవంతుడు (శ్రీకృష్ణుడు) గా జన్మిస్తే ఆయనను గురువు అని అంటాము... పూర్వము "గురువు గుండ్రాయి లాంటి వాడు" సామెత గా అనెడి వారు, ఆది – అంతము లేని వాడు అని అర్థం. గుండ్రాయికి కూడా మొదలు చివర అనేవి ఉండవు కాబట్టి అలా పోల్చారు... దేవుడే మనిషి జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అని అనాలి... ఆషాడ మాసం లో పౌర్ణమి చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండుట వలన గురు పౌర్ణమిగా నిర్ణయించి సాక్షాత్తు శ్రీకృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి గురు పూజ చెయ్యాలి అనితెలిపారు.. గురు పౌర్ణమి రోజు మోక్ష ధ్యాస తో శ్రీ కృష్ణ చరణాలను శరణు వేడాలిఅన్నారు ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు సభ్యులు రాజేంద్రప్రసాద్, రామయ్య, ప్రవీణ, కీర్తి, శేఖర్, వేణు, సునీత, మోహన్, సుమలత, విజయమ్మ, రఘురామయ్య, కె.వి రత్నం, పద్మజ, అన్నపూర్ణ, డి.వి.ప్రసాద్, కల్పన, పాలూరు ప్రదీప్, నరసింహ ప్రసాద్‌లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- కోవూరు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి**




**కోవూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో రైతు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడం లేదని, ప్రభుత్వం చర్యలు తీసుకోవలని కోవూరు మండలం వైసీపీ అధ్యక్షులు అత్తి పల్లి అనూప్ రెడ్డి అన్నారు. ఒకవైపు రైతు నష్టాల్లో కూరుకుపోతుంటే, మరోవైపు కొంతమంది రైస్ మిల్లర్లు భారీగా ధాన్యాన్ని నిల్వ (స్టాక్) చేసి, కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరలను విపరీతంగా పెంచి విక్రయిస్తూ భారీ లాభాలు పొందుతున్నారు. ఈ పరిస్థితిలో రైతుకు లాభం లేకపోగా, సామాన్య ప్రజలు కూడా అధిక ధరల భారాన్ని భరించాల్సి వస్తోంది అన్నారు. రైతు నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, గోదాముల్లో నిల్వ ఉంచి, మార్కెట్‌లో ధరలు పెరిగిన తర్వాత అధిక ధరలకు విక్రయించడం రైతు శ్రమను దోపిడీ చేయడమే. ప్రభుత్వం వెంటనే రైస్ మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. గతంలో రైతులందరూ తమ ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాలు (డ్రైయింగ్ యార్డులు), అలాగే నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ గోదాములు ఏర్పాటు చేయాలని ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతూనే ఉన్నారు. కానీ ఇప్పటికీ ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, డెల్టా ప్రాంతం మరియు కోవూరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రైతుల కోసం కళ్లాలు, ఆధునిక గోదాములు ఏర్పాటు చేయాలి. ఇకపోతే కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న విధంగా, రైతులు గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యానికి సంబంధించి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించే విధానాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలి. అక్కడ రైతులు తమ పంటను గోదాముల్లో నిల్వ చేసి, దానికి అనుగుణంగా బ్యాంకుల ద్వారా తక్షణ ఆర్థిక సహాయం పొందుతున్నారు. ఈ విధానం వల్ల రైతు తక్కువ ధరకు అమ్మాల్సిన అవసరం లేకుండా, సరైన ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం లభిస్తోంది. అలాంటి వ్యవస్థను మన రాష్ట్రంలో కూడా తీసుకువచ్చి రైతులకు మరింత మేలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. రైతులు తమ ధాన్యాన్ని వెంటనే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి లేకుండా, ప్రభుత్వ గోదాముల్లో సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర వచ్చినప్పుడు రైతు తన ధాన్యాన్ని విక్రయించుకునే వెసులుబాటు ఉంటే రైతుకు మంచి ఆదాయం లభిస్తుంది. అదే సమయంలో రైస్ మిల్లర్లు భారీగా ధాన్యాన్ని నిల్వ చేసి మార్కెట్‌ను నియంత్రించే అవకాశం కూడా తగ్గుతుందని చెప్పారు. డెల్టా ప్రాంతం రాష్ట్రానికి అన్నపూర్ణగా నిలుస్తోంది. అలాంటి ప్రాంత రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అందువల్ల ప్రభుత్వం ఆలస్యం చేయకుండా రైతుల కోసం కళ్లాలు, గోదాముల నిర్మాణాన్ని చేపట్టి, రైస్ మిల్లర్ల దోపిడీకి వెంటనే అడ్డుకట్ట వేయాలని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రకారం గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ధాన్యం కొనుగోలు వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు కోవూరు వైసీపీ అధ్యక్షులు అత్తి పల్లి అనూప్ రెడ్డి అన్నారు. ఈసారి రైతులకు ధాన్యానికి పుట్టికి కనీసం 28,000 గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు, యంత్రాల అద్దెలు, రవాణా వ్యయాలు–అన్నీ విపరీతంగా పెరిగాయిని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పుట్టికి 28,000 ధర కూడా రాకపోతే రైతు అన్ని విధాలా తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అనూప్ అన్నారు. రైతు బలపడితేనే వ్యవసాయం బలపడుతుంది. రైతుకు న్యాయం జరిగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అభి ప్రాయం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, రైతులు ఉన్నారు.

# ఆలయ సేవ చేసే భాగ్యం కలిగింది

**- కోదండరామ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరులోని సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ నూతన ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం సోమవారంఅత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్ క్రిష్ణా రెడ్డికి, ఇతర బోర్డు సభ్యులు పోరండి నాగలక్ష్మి, యనమల రామచంద్రయ్య, చీకటి లక్ష్మి, అనంతసాగరం రవి, కొప్పోలు ప్రసాద్, కర్రిఆవుల సుధాకర్, నిమ్మల ఆదిలక్ష్మమ్మ, తిరుమంచి కౌశల్యమ్మ, పరంకుశం శ్రీకాంత్‌లకి ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం, పునరుద్ధరణ లేదా ఆలయ సేవ చేసే అవకాశం లభించడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. తాను మూడు పర్యాయాలు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ట్రస్టు బోర్డు సభ్యురాలిగా సేవలందించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అన్ని పదవుల కంటే ఆ బాధ్యతనే అత్యున్నతమైనదిగా భావిస్తానని పేర్కొన్నారు. స్వామి వారి ఆశీస్సులు నూతన ట్రస్టు సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉం డాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఆలయంలో ఆగమశాస్త్రాలు, సాంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నిత్య పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయ పవిత్రతను పరిరక్షిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. రాబోయే రోజుల్లో శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆలయ వైభవాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రతి విషయంలో తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కోదండరామ స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దేవస్థానం పాలక మండలి సభ్యులు. స్థానిక టీడీపీ, నాయకులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, పెన్నా డెల్టా చైర్మెన్ గోపిరెడ్డి, బాల రవి, నాటకరాణి వెంకట్. ఇంతా మల్లారెడ్డి, కూటమి నేతలు మహిళలు తదితరులు ఉన్నారు.

# పముజలకు నివాళులు అర్పించిన బీసీవై పార్టీ అధ్యక్షులు బుధవరపు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సిపిఐ సీనియర్ నాయకులు మరియు చేనేతలలో అగ్ర నాయకులు యోధుడు అయినా పముజుల దశరధ రామయ్య భౌతిక కాయానికి భారత చైతన్య యువజన పార్టీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ మరియు స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోమ గోపాల్ సంయుక్తంగా పముజల పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మంచి సేవా తత్పర్యుడుగా పేరొందిన నేతగా వ్యవహరించడం జరిగిందన్నారు. పార్టీలకు కులాలకు అతీతంగా ప్రజలకు సేవలు చేసి నమ్ముకొన్న సిద్ధాంతాలు ప్రకారం సేవ కుడిగా రాణించిన దసన్నకు జోహార్లు అని బుధవరపు బాలాజీ అన్నారు. 94 ఏళ్ల వయసులో కూడా



ప్రజా సేవ చేస్తున్నారని పలువురు నేతలు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ వి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అమరావతి ప్రస్థానంలో శ్రామిక శక్తికి సెల్యూట్

## - ప్రజారాజధాని అమరావతి ప్రగతి ప్రస్థానంలో కార్మికులదే కీలక పాత్ర

## - అమరావతి నిర్మాణంలో అలుపెరగక శ్రమిస్తున్న ప్రతి కార్మికుడికి సెల్యూట్!

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలో 27 వేల మంది కార్మికులతోను 5140 యంత్రాలతో పనులు హై స్పీడ్‌లో పరుగులు పెడుతున్నాయి. అమరావతి నిర్మాణం ఊపందుకుంది. అక్కడ మూడు షిఫ్టుల్లో కార్మికులు పనిచేస్తున్నారు. మొత్తం 27 వేల మంది అమరావతి నిర్మాణ పనులు కార్మికుల శ్రమ, వారి దీక్ష, వారి ఏకాగ్రతతో శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం రూ. 57,821 కోట్ల విలువైన భారీ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో రూ. 50,943 కోట్ల విలువైన పనులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. ఇవన్నీ ప్రభుత్వ పనులే ప్రభుత్వ నిర్మాణాలతోపాటు ప్రైవేటు కంపెనీలు కూడా వాటికి కేటాయించిన స్థలాల్లో ప్రారంభిస్తున్నాయి... రెండు, మూడేళ్లలో విజుబుల్ డెవలప్‌మెంట్‌ను అమరావతిలో ప్రజల ముందు ఉంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారు. ఆ దిశగా శ్రామికులు రేయింబవళ్ళు అలుపెరగకుండా శ్రమిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకనుగుణంగా కార్మికులు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. వజ్రంలాంటి ఐకానిక్ టవర్ల నిర్మాణంలో కార్మికశక్తి తమ అనుభవాన్ని రంగరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాదాపు ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవంతో దేశంలోనే అత్యంత అనుభవజ్ఞులైన నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. పాలనలో తీసుకునే నిర్ణయాలు, దీర్ఘకాలిక ప్రణాళికలు, సంక్షోభాలను అవకాశాలుగా మలచే తీరుతో ఆయన ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఒక ఆధునిక నగరాన్ని నిర్మించాలనే లక్ష్యంతో అమరావతి ప్రాజెక్టును ప్రారంభించారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో రాజధాని నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, అనుమతుల ప్రక్రియలకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చింది. అదే సమయంలో రాజకీయ పరిణామాలు కూడా వేగంగా మారడంతో ప్రభుత్వం అనుకున్న వేగంతో పనులు ముందుకు తీసుకెళ్లలేకపోయింది. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితులను సమీక్షించిన చంద్రబాబు, ఎక్కడ లోపాలు జరిగాయో గుర్తించి కొత్త వ్యూహంతో ముందుకు సాగారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే పాలనతో పాటు రాజధాని నిర్మాణంపై



ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజుల నుంచే అమరావతి పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వివిధ సంస్థల ద్వారా నిధులు సమీకరించి తొలి దశ నిర్మాణానికి భారీ మొత్తాన్ని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వానికి పెద్ద విజయంగా చెప్పాలి. ఈ నిధులతో ప్రధాన ప్రభుత్వ భవనాలు, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూర్వ వైభవం కనిపిస్తోంది. ఐదేళ్లుగా నిర్మాణ ప్రాంతాల్లో నెలకొన్న నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.. ఇప్పుడు ఎక్కడ చూసినా కార్మికుల సందడి, యంత్రాల హోరు వినిపిస్తోంది. కార్మికులతో అమరావతి ప్రాంతం సందడిగా కనిపిస్తున్నది. కార్మికుల కష్టంతోనే అమరావతి పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని పనులకు మళ్లీ మోక్షం లభించింది. ప్రస్తుతం వివిధ నిర్మాణాల్లో 27 వేల మంది కార్మికులు నిమగ్నమై ఉండి అహరం శ్రమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు కార్యరూపం తీసుకువస్తున్నారు.

**అమరావతి రాజధాని నిర్మాణ కార్మికులకు భద్రత**

అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో ఉన్నకార్మికులకు తగిన భద్రత ఇవ్వడంతోపాటు, ఆరోగ్యం వారి సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థతోపాటు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ సంస్థలతోపాటు రాష్ట్ర కార్మిక శాఖ కూడ వారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. లేబర్ క్యాంపుల పరిసర ప్రాంతాలలో క్రమం తప్పకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మెరుగైన భోజనం అందించాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. కార్మికుల వైద్య అవసరాల కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేసి వైద్యులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదాల నివారణకు క్యాంపు సైట్లలో హై-కెపాసిటీ వాటర్ మోటార్లు, నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. నిర్మాణ రంగంలో 'లాస్ట్ టైమ్ ఇంజరీ' లేని సురక్షితమైన పనిగంటలను నమోదు చేసేలా కార్మికులకు ముందస్తు భద్రతా శిక్షణ ఇచ్చారు. లేబర్ క్యాంపుల వద్ద సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, కార్మికులకు రక్షణ కల్పించడానికి పోలీసు శాఖతో సమన్వయం చేస్తున్నారు. రాజధాని పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే పెట్టుబడులు పెరగడంతో పాటు భూముల విలువ కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉందా. భవిష్యత్తులో ప్రభుత్వానికి అదనపు ఆదాయ వనరులు ఏర్పడటంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతికి తలమానికమైన ఐకానిక్ టవర్ల నిర్మాణాలు చకచక సాగుతున్నాయి. దేశంలోనే తొలిసారిగా డయాగ్రిడ్ టెక్నాలజీతో ఈభవనాల నిర్మాణంలో కార్మికులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారు. వారందరికి కార్మికశాఖ పక్షాన సెల్యూట్ . అమరావతిని రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో చంద్రబాబు ముందుకు సాగుతుండగా, ఈ ప్రాజెక్టు విజయమే ఆయన రాజకీయ జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

**వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# మదనపల్లె తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## - రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ ఫేజ్-2కు ఆమోదం - 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసేలా చర్యలు - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




**మదనపల్లె, (రాజధాని వార్తలు):** మదనపల్లె నియోజక వర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద మదనపల్లె నియోజకవర్గానికి రూ. 1,000 కోట్ల అంచనా వ్యయంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ఫేజ్-2 మంజూరైనట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో స్థానిక శాసన సభ్యులు షాజహాన్ భాషా ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామ సముద్రం గ్రామీణ మండలాలతో పాటు మదనపల్లె పట్టణానికి సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 కింద గండికోట రిజర్వాయర్ నుంచి గుర్రంకొండ మండలం మావిళ్ల వారిపల్లె వరకు పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మావిళ్ల వారిపల్లె వద్ద నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడి నుంచి మదనపల్లె నియోజకవర్గంతో పాటు మదనపల్లె మున్సిపాలిటీకి తాగునీటిని సరఫరా చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు వివరించారు. వాటర్ గ్రిడ్ ఫేజ్-2కు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నామని, 18 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు అమలుకు అవసరమైన వివిధ శాఖల అనుమతులను త్వరితగతిన పొందాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మదనపల్లె నియోజకవర్గ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఈ ప్రతిష్టాత్మక వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తయితే, ఈ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు నిరంతరం అందుబాటులోకి రానుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan